## క్లుప్తంగా

### విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

**ఉండ్రాజవరం:** ప్రభుత్వ పాఠశాలలను, ఉచిత సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ అన్నారు. మండలంలో దమ్మెన్ను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఆయన విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీసీ చైర్మన్ డి.గార్లమ్మ, వైస్ చైర్మన్ డి.గవర్రాజు, పాఠశాల హెచ్ఎం వెలగల భాస్కరరెడ్డి, అచ్చుతరామయ్య, వి.శ్రీను, లక్ష్మీనారాయణ, బన్ను, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### దుద్దుకూరులో రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

**దేవరపల్లి:** దుద్దుకూరులో గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు మంగళవారం తెలిపారు. గ్రామంలో ఆర్డీడీఎస్‌లో భాగంగా నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

### గండేపల్లికి ఘన సత్కారం



పెరవలి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గండేపల్లి రామకృష్ణను సత్కరించిన పార్టీ శ్రేణులు

**పెరవలి:** వైఎస్సార్ సీపీ పెరవలి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గండేపల్లి రామకృష్ణను మంగళవారం పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గండేపల్లి మాట్లాడుతూ తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ అవినీతిని ఐక్యంగా ఎండగడదామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. నిడదవోలు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు పుట్టినరోజు వేడుక మంగళవారం పెరవలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ, నూతనంగా పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన గండేపల్లి రామకృష్ణ కలసి కేక్ కట్ చేసారు.

### తహసీల్దార్‌కు పలువురి అభినందనలు

**తాళ్లపూడి:** సాధారణ బదిలీల్లో భాగంగా తాళ్లపూడి తహసీల్దార్‌గా నియామకం పొంది ఇటీవల బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీలావణ్యను పలువురు నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం ఉన్నారు. కూచిపూడి గణపతి కృష్ణ, అనపర్తిప రసాద్, నామా నరేంద్ర, అన్నమరెడ్డి రమణ, తిగిరిపల్లి కనకరత్నం, గాంధీ తదితరులన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



షేక్ అహ్మద్‌వలీ (39)

**నిడదవోలు రూరల్:** గేదెను ఢీకొని తలకు తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్. బాలాజీ సుందరరావు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నిడదవోలు మండలం కోరుమామిడికి చెందిన షేక్ అహ్మద్ వలీ (39) టైర్ల పంక్చర్లు వేస్తూ జీవనోపాధి సాగించేవాడు. మూడు నెలలు క్రితం జీవనోపాధి నిమిత్తం అహ్మద్ వలీ దుబాయ్ వెళ్లి ఈనెల 8వ తేదీ ఆదివారం ఉదయం ఇంటికి వచ్చాడు. కొద్ది గంటల తర్వాత అహ్మద్ వలీ బైక్‌పై తాడిమళ్లలో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా కంచాలమ్మగుడి సమీపంలో గేదెను ఢీకొట్టడంతో కింద పడిపోయి తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడి నుంచి అత్యవసర వైద్యసేవల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా వలీ అహ్మద్ మృతి చెందినట్లు భార్య షేక్ జహ్వా ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### మారణకాండ ఆపాలి

**ప్రకాశం నగర్:** పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ ఆపాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జాంపేట ఆజాద్‌చౌక్ సెంటర్‌లో పాలస్తీనాకు సంఘీభావంగా సీపీఐ, సీపీఐ-ఎం, సీపీఐ-ఎంఎల్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఐ-ఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.పవన్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో పాలస్తీనా ప్రజలు 55 వేల మందికి పైగా మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని తెలిపారు. పాలస్తీనా ప్రజలకు భారతదేశం సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు అందిస్తున్న సైనిక, భద్రత సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ-ఎంఎల్ నాయకుడు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు



తాళ్లపూడి మండలంలో జీలుగ సాగు

- పచ్చిరొట్ట ఎరువుల ద్వారా నేలతో పోషకాలు వృద్ధి
- పంట దిగుబడి పెరిగి, ఎరువుల ఖర్చు తగ్గి రైతుకు లాభం

**తాళ్లపూడి:** సేంద్రియ ఎరువు తగినంత లభ్యం కాని నేటి రోజుల్లో రైతులు తక్కువ ఖర్చుతో పచ్చిరొట్ట పైర్ల సాగుతో వాటి నుంచి వచ్చే పోషకాల ద్వారా నేలకు సేంద్రియ ఎరువులను అందించడం ఉత్తమమైన ప్రత్యామ్నాయ మార్గం. నియోజకవర్గంలోని రైతులు ఇటీవల పచ్చి రొట్ట పైర్లు సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గం పరిధిలో తాళ్లపూడిలో 8,768 ఎకరాల్లో, కొవ్వూరులో 10,790 ఎకరాలు, చాగల్లు మండలంలో 8,220 ఎకరాల్లో మొత్తం 27,778 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అధికారులు నవధాన్యాల పేరుతో పచ్చిరొట్ట విత్తనాలు అందజేసారు. 61.46 క్వింటాళ్లు రైతులకు సబ్సిడీపై అందజేశారు. కొందరు రైతులు జీలుగ, ఇతర పచ్చి రొట్ట విత్తనాలు వేసారు.

**నేల సారవంతమవుతుంది**

తాళ్లపూడి మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రుచిత పచ్చి రొట్ట పైర్ల లాభాలు వివరించారు. పచ్చిరొట్ట పైరు నుంచి సగటున 0.5 నుంచి 0.7 శాతం నత్రజని, 0.1 నుంచి 0.2 శాతం భాస్వరం, 0.6 నుంచి 0.8 శాతం పొటాషియం లభ్యం కావడం ద్వారా నేల సారవంతమవుతుందని అన్నారు. పైర్ల పెరుగుదలకు రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో ఉండే పంటలకు మేలు చేసే లక్షలాది సూక్ష్మ జీవులు చనిపోతాయని ఆమె తెలిపారు. దీన్ని నివారించేందుకు భూమిలో తగిన సేంద్రియ పదార్థాలు వృద్ధి చెందేందుకు పచ్చిరొట్ట ఎరువుల వాడకం అతి సులువైన చౌక పద్ధతి అని తెలిపారు. జీలుగ, జనుము, పిల్లి పెసర, పెసర, అలసంద, అవిస వంటి పప్పుదినుసు పైర్లు నేలకు అత్యంత మేలు చేసే రకాలని చెప్పారు.

**నాట్లకు 15 రోజులు ముందు చల్లుకోవాలి**

పచ్చిరొట్ట విత్తనాలను దాళ్వాలో వేసిన వరిని కోసే ముందు లేదా జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు కురిసిన తరువాత చల్లుకోవాలి. ఖరీఫ్ ఆకుమడి వేయడానికి 15 రోజులు ముందుగా పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను పొలంలో చల్లుకుంటే లాభదాయంగా ఉంటుంది. జనుము ఎకరాకు 20 నుంచి 25 కిలోలు, జీలుగ 13 నుంచి 15 కిలోలు, పిల్లి పెసర 6 నుంచి 8 కిలోలు, అలసంద 14 నుంచి 15 కిలోలు, పెసర మినుము 6 నుంచి 8 కిలోలు విత్తనం అవసరమవుతుంది. జీలుగ, జనుము, అలసంద పైర్లు ఎకరాకు 5 నుంచి 7 టన్నులు, పిల్లి పెసర, పెసర, మినుము పైర్లు సుమారు 3 టన్నుల పచ్చిరొట్టను ఇస్తాయి.

### ముందుగానే కలియదున్నుకోవాలి



ఈ పైర్లు వేసిన తరువాత పూతకు వచ్చే సమయంలో నేలలో కలియదున్ని ఎరువుగా ఉపయోగించుకోవడాన్నే పచ్చిరొట్ట ఎరువు అంటారు. నేలను కలియదున్నిన తరువాత అది మురగడానికి తగినంత నీరు పొలంలో ఉండాలి. పచ్చిరొట్ట వేళ్ల బొడిపెల్లోని సూక్ష్మ జీవుల ద్వారా నేలలో నత్రజని స్థిరీకరణ జరుగుతుంది. నేలలో మిగిలిన మొక్కల భాగాల నుంచి నత్రజని తరువాత వేసే పంటకు ఉపయోగపడుతుంది. పచ్చిరొట్ట వాడకం వల్ల తేలిక నేలల్లో నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది. నేల పైపొర పాడవ్వకుండా రక్షించుకోవచ్చు. నేల నిర్మాణాన్ని, భౌతిక స్థితిని పెంచుకోవచ్చు. అంతేకాకుండా చౌడు నేలల యాజమాన్యానికి పచ్చిరొట్ట ఎరువులు వేస్తే భూమిలోని భౌతిక, రసాయన సమస్యలు తగ్గి నేల గుల్లబారి గాలి, నీటి ప్రసరణ, వివిధ రకాల మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూసారం పెరగడమే కాకుండా తరువాత వేసే పంటకు వాడే నత్రజని ఎరువులను 20 శాతం తగ్గించుకోవచ్చు. నేలను కలియదున్నిన తరువాత బాగా నీరు పెట్టి పచ్చిరొట్ట ఎరువును రెండు వారాలపాటు పంట పొలంలో మురగనివ్వాలి. ఈ సమయంలో కొన్ని హానికరమైన సేంద్రియ ఆమ్లాలు తయారవుతాయి. కొత్త పంట నాటే ముందు మురుగునీటిని బయటకు పంపి కొత్త నీటిని నింపి పంట నాటుకోవాలి. పచ్చిరొట్ట విత్తనాన్ని చల్లే ముందు ఎకరాకు 50 కిలోలు పైరును నేలలో దున్నిన సమయంలో మరో 50 కిలోల సూపర్ పాస్ఫేట్‌ను వేస్తే రొట్ట ఎక్కువగా తయారై తొందరగా నేలలో చివికి తరువాత పైరుకు కావాల్సిన భాస్వరాన్ని అందిస్తుంది. పచ్చిరొట్ట ఎరువులు వేసిన పొలంలో నత్రజని ఎరువుల మోతాదును తగ్గించి వాడుకోవాలి, లేదంటే పంటపై తెగుళ్ల దాడి ఎక్కువగా ఉంటుంది.

– రుచిత, వ్యవసాయ శాఖాధికారిణి, తాళ్లపూడి మండలం

# కూటమి పాలనలో అన్నీ మోసాలు, అరాచకాలే

- 2.60 లక్షల మంది వలంటీర్లకు అన్యాయం
- 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకం ఆవిష్కరణ
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చాగల్లులో 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని అవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు



యర్నగూడెంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

**చాగల్లు:** చంద్రబాబు ఏడాది పాలనలో అన్నీ మోసాలు, అరాచాకాలే కనిపిస్తున్నాయని, ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలిచ్చి మరోసారి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. చాగల్లులో శ్రీ కృష్ణదేవరాయ కల్యాణ మండపంలో మంగళవారం 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం ' అంటూ చంద్రబాబు ఏడాది పాలనలో అరాచకాలు, మోసాలను వివరిస్తూ ప్రచురించిన పుస్తకాన్ని తలారి వెంకట్రావు, పార్టీ నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ చంద్రబాబు తల్లికి వందనం పేరుతో ప్రజలను వంచన చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని, రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. చదువుకునే పిల్లలు, రైతన్నలు, మహిళలు, నిరుద్యోగులను మోసగించి వంచించిందని అన్నారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధుల పాలయ్యారని తలారి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రూ.1.37 లక్షల కోట్ల అప్పులు చేసి చంద్రబాబు రికార్డు సృష్టించారని విమర్శించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ జిల్లా ఆర్‌టీఏ విభాగం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జాలెం వెంకట్రావు, నాయకులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గేడా శ్యామ్, బొర్రా కృష్ణ, సర్పంచ్‌లు కుదప రాంబాబు, ముప్పిడి మహాలక్ష్మడు, ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు, ఉన్నమట్ల బ్రాహ్మనందం, వుండవల్లి శ్రీనివాసరావు, యార్లగడ్డ జోషి, బొర్రా రజనీ ప్రసాద్, తాళ్లూరి దామోదరం, ఎస్‌కే షరీఫ్, మేకా సురేష్ పాల్గొన్నారు.

**చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి**

**దేవరపల్లి:** ఎన్నికల్లో మోసపూరితమైన వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పిలుపునిచ్చారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఎంపీపీ దుర్గారావు, మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. వైఎస్ జగన్ పాలనలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలు, కూటమి ప్రభుత్వంలో ఏడాది పరిపాలనలో జరిగిన మోసాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ అధిష్టానం పుస్తకంలో పొందుపర్చినట్టు మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు గన్నమని జనార్ధనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, స్థానిక సర్పంచ్ బొంతా భరత్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయిఈశ్వరరెడ్డి, దేవరపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, యర్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి సుధాకర్, పార్టీ నాయకులు వెలగా శ్రీనివాస్, పుట్టా వెంకటస్వామి, పచ్చా రాంగోపాల్, దోనెల్లి జానకీరామ్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



దేవరపల్లిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్ఎం సూర్యనారాయణ, నాయకులు

**దేవరపల్లి:** స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్, యూనిఫాం అందజేశారు. మంగళవారం హైస్కూలు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఐ. సూర్యనారాయణ, కూటమి నాయకులు సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలలో ఈ విద్యాసంవత్సం పాఠశాలలో 450 మంది విద్యార్థులున్నట్టు ఆయన తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంలో అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతుల భవనాలను పూర్తి చేసి, బెంచీలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ప్రాథమిక ఉన్నత విద్యతో పాటు ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఒకే ప్రాంగణంలో ఉన్నందున ప్రభుత్వ వసతిగృహం ఏర్పాటు చేస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆయన తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని ఆయన నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు సుంకర దుర్గారావు, మాజీ సర్పంచ్ కాట్రు భీమరాజు, ఉప్పులూరి రాంబాబు, గద్దే సుబ్రహమణ్యం, విద్యాకమిటీ చైర్మన్ వి.రాజు, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు ముత్యాల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చెరువుల్లో చెత్త, వ్యర్థాల తొలగింపు

సాక్షి ఇంపాక్ట్



చాగల్లు చెరువులో చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

**చాగల్లు:** మండలంలోని చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, నందిగంపాడు, కలవలపల్లి ఎస్. ముప్పవరం, మల్లవరం గ్రామ పంచాయతీ చెరువుల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈ నెల 16న 'కాలుష్య కాసారాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు.పంచాయతీ చెరువుల్లో చెత్త, వ్యర్థాలను తొలగించారు.ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి ఆర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, చెరువుల లీజుదారులతో, సొసైటీ నాయకులతో సమీక్షించి చెరువులను శుభ్రం చేశామన్నారు. రాబోవు కాలంలో చెరువులను పరిశుభ్రంగా ఉంచాలని ముందస్తు నోటీసులు జారీ చేశామని తెలిపారు. చెరువుల పరిసర ప్రాంతాలు ప్రజలు, వ్యర్థాలను చెరువుల్లో వేయరాదని, పంచాయతీ క్లాప్ మిత్రలకు చెత్తను అందజేసేయాలని సూచించారు. చెరువులను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు.

### వ్యవసాయ శాఖలో బదిలీలు

**రాజమహేంద్రవరం రూరల్:** ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకుడి కార్యాలయ పరిధిలో పలు బదిలీలు జరిగాయి. కడియం వ్యవసాయాధికారిగా పద్మలత, రాజానగరం వ్యవసాయాధికారిగా కల్యాణ సూర్యకుమార్, పీఏ టు ఏడీఏగా కె.సూర్యరమేష్ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా కె.సురేష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్‌గా సుందరి నియమితులయ్యారు.

# 21న యోగా దినోత్సవం

**నిడదవోలు రూరల్:** ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని ఎంపీడీఓ జగన్నాథరావు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో యోగా దినోత్సవంపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఉద్యోగులు రోజువారి కార్యక్రమాల్లో అనేక శారీరక, మానసిక ఒత్తిడులకు గురవుతుంటారని, యోగాను దినచర్యలో భాగం చేసుకోవడంతో ఉల్లాసాన్నిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు టి.గోపాలకృష్ణ, కె.శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


**యోగా సాధనతో మానసిక ప్రశాంతత**

**ఉండ్రాజవరం:** ప్రతి రోజూ ఒక అర గంట యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని పాలంగి సర్పంచ్ బోక్క శ్రీనివాసు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలో పాలంగి సచివాలయం వద్ద మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు మద్దాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ. హసన్‌జానీ, ఎన్‌జీవోస్ మాజీ నాయకులు పీవీ రమణ, యూటీఎఫ్ నాయకులు పిల్లి విష్ణుమూర్తి, పి.భ్రమరాంబ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నవ ధాన్యాల సాగుకు సమాయత్తం

**రాజమహేంద్రవరం రూరల్:** రైతులు నవధాన్యాల సాగు ద్వారా తమ పొలాలను సారవంతం చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి మండలంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ద్వారా భూమిని సారవంతం చేసుకునేందుకు పీడీఎంఎస్ కిట్లు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని తొర్రేడు గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ, రైతులకు త్వరలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సాగు పరికరాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. ఇకపై ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి భీమరాజు అన్నారు.

### పిల్లల్లో అమాయకత్వం వల్లే అఘాయిత్యాలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

**కంబాలచెరువు:** సమాజంలో పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, మోసపూరితంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీతంపేటలోని పంతం సత్యనారాయణ ఎలిమెంటరీ స్కూల్‌లో మంగళవారం మంచి, చెడు స్పర్శలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, పిల్లల విషయంలో ఎవరూ హద్దులు దాటి ప్రవర్తించరాదని హెచ్చరించారు. పిల్లలు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండాలని, వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఉద్బోధించారు. బాల్య వివాహ నిషేధ చట్టం-2006, బాల కార్మిక నిర్మూలన చట్టం-1986 తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నల్సా (పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం-2024 ద్వారా తమ సంస్థ పిల్లలకు అందిస్తున్న న్యాయ సేవలను వివరించారు. పిల్లలకు ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా తమ సంస్థను సంప్రదించాలన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు.

### అట్టహాసంగా శ్రీనివాస్‌నాయుడి జన్మదిన వేడుకలు



నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న పార్టీ శ్రేణులు

**నిడదవోలు:** నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి.శ్రీనివాస్‌నాయుడు జన్మదిన వేడుకలను పట్టణంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కలసి అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. శ్రీనివాస్‌నాయుడి జన్మదిన కేక్‌ను పార్టీ శ్రేణులు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని చర్ల సుశీల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేయడంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, కౌన్సిలర్లు దాకే అనిల్‌కుమార్, ఆకుల ముకుందరావు, సర్పంచులు తిక్కా శ్రీనివాస్, కొండపల్లి శ్రీనివాస్, వెలగన నరేష్, నాయకులు సుంకవల్లి శ్రీహరి, ఎస్‌కే ఖాన్‌భాషా, గజ్జరపు శ్రీరమేష్, నాగిరెడ్డి సత్తిపండు, బిర్రే రామకృష్ణ, పాలా కిరణ్, వంగా నాగేశ్వరరావు, బయ్యే విజయ్, ఎస్‌కే జాకిర్, మానుకొండ చంద్రబాబు, ఉసురుమర్తి సూరి, సాయి పాల్గొన్నారు.

### మాజీ మంత్రి వనితను కలిసిన గంగరాజు



మాజీ హోం మంత్రి తానేటి వనితను అభినందిస్తున్న మేడిబోయిన గంగరాజు

**దేవరపల్లి:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి మేడిబోయిన గంగరాజు మంగళవారం తాడేపల్లిగూడెంలోని మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మాజీ మంత్రి వనితను మర్యాదపూర్వకంగా కలిసినట్టు ఆయన తెలిపారు.

### పచ్చిరొట్ట పంటను దమ్ములో దున్నుకోవాలి

**దేవరపల్లి:** పచ్చిరొట్ట పంటలను సార్వా వరి సాగు చేసే భూముల్లో కలియ దున్నుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. కమల్‌రాజ్ రైతులకు సూచించారు. మండలంలోని దుద్దుకూరు, గౌరీపట్నంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కమల్‌రాజ్ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు, నవధాన్యాలు వేసిన రైతులు పంటను 40 రోజుల వ్యవధిలో కోసి దమ్ములో దున్నాలని ఆయన సూచించారు. దీని వల్ల భూమిలో సేంద్రీయ కార్బన్ విలువలు పెరుగుతాయని ఆయన అన్నారు. సార్వాలో స్వర్ణ ఎంటీయూ 7029, ఎంటీయూ 1318 రకాల వరిని సాగు చేయాలని ఆయన రైతులకు వివరించారు. సార్వా పంటల సాగు పద్ధతులు, యాజమాన్య విధానాలను రైతులకు వివరించారు. మినుము పంట సాగులో మెళకువలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### పంట బోదెల్లో పూడిక తొలగింపు

**తాళ్లపూడి:** రైతులు ఇబ్బందులు పడకుండా పంచాయతీ ఆధ్వర్యంలో పంట బోదెలు, మురుగు బోదెలను పూడిక తీత పనులు చేపట్టారు. సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం పూడికతీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి, గెడ్డం గాంధీ తదితరులున్నారు.